ముగిసిన ప్రచార ఘట్టం


మడకశిరరూరల్: చెందకచెర్లులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


లేపాక్షి: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలంటూ కరపత్రాలు అంజేస్తున్న పార్టీ నాయకులు


హిందూపురం: ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సిబ్బందిని ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా నాయకుల విస్తృత ప్రచారం

రొద్దం: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధానత ఓటు వేసి గెలించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శనివారం మండల నాయకులు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలు, పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ఓట్లను అభ్యర్థిచారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు మారుతిరెడ్డి, సర్పంచ్ రూప, సచివాలయాల సమన్వయకర్త ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

లేపాక్షి: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డికి మద్దతుగా స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం ఉదయం నాయనిపల్లి పంచాయతీలో ప్రచారం నిర్వహించారు. ఈనెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ తిప్పన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తొలి ప్రాధాన్యత ఓటు వేయండి

మడకశిరరూరల్: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలో నిలిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండలంలోని అన్ని పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ప్రచారం చేశారు. పట్టభద్రుల ఇళ్ల వద్దకు వెళ్లి, రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయాలంటూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల జగనన్న సచివాలయ కన్వీనర్, మాజీ ఎంపీపీ, సచివాలయ కన్వీనర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలో చివరి రోజైన శనివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా నిర్వహించారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రచారాన్ని నిర్వహించి పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటలక్ష్మమ్మ, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్, కౌన్సిలర్లు నాగేంద్ర, మేఘనరమేష్, దాసన్న, అంజి, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ జయరాజు, స్థానిక నాయకులు అంజలి, గోపి తదితరులు పాల్గొన్నారు.

చివరి రోజు ముమ్మరంగా ప్రచారం

హిందూపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శనివారం సాయంత్రం వరకూ వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి, పార్టీ నాయకులు పోలీసుస్టేషన్లు, ప్రభుత్వ ఆసుపత్రి, సచివాలయాల్లో ప్రచారం చేశారు. వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. విద్య వైద్యం ఆరోగ్యం, రాజకీయరంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుభిక్ష పాలనల్లో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. యువత, ఉపాధ్యాయ వర్గాలకు అన్ని విధాలా మేలు చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు. రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

సీఎంకు అండగా నిలుద్దాం

పేదల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిందామని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఉపేంద్రరెడ్డి, మండల వైస్‌ఎంపీపీ రఘునాథరెడ్డి, పార్టీ నాయకులు, కౌన్సిలర్లు విస్తృతంగా ప్రచారాలు నిర్వహించారు. మండలంలోని సచివాలయాలు, ఓటర్ల ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి పట్టభద్రుల ఎమ్మెల్సీ వెన్నపూసరవీంద్రారెడ్డి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో చైర్‌పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామిరెడ్డి, కౌన్సిలర్లు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించి ప్రచారాలు చేపట్టారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

అమరాపురం/రొద్దం/గుడిబండ/రొళ్ల/లేపాక్షి/హిందూపురం/పరిగి/సోమందేపల్లి/పెనుకొండ: ఈనెల 13న జరగబోవు పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్ పరిశీలించారు. శనివారం ఆయన అమరాపురం, రొద్దం, గుడిబండ, రొళ్ల, లేపాక్షి, హిందూపురం, పరిగి, సోమందేపల్లి, పెనుకొండలో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. ఎన్నికల సిబ్బంది, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్లకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. తాగునీరు, వెబ్‌కాస్టింగ్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఆవరణ చుట్టు పక్కల పోలింగ్ జరిగే రోజున 100 మీటర్ల దూరం వరకూ ఓటర్లు తప్ప ఇతర వ్యక్తులు తిరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్

గోరంట్ల: ఈనెల 13వ తేదీన జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల కోసం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ రంగనాయకులు, సీఐ సుబ్బరాయుడు పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యంతో పాటు, ర్యాంప్ సౌకర్యం ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్, వీర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

హిందూపురం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ యశ్వంత్ అన్నారు. శనివారం సాయంత్రం ఎన్నికల విధులకు హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశం అయ్యారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం నిబంధనలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని, గుర్తింపు కల్గిన ఓటరు తప్పా మిగిలిన వారిని కేంద్రం వద్దకు అనుమతించవద్దన్నారు. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చేటప్పుడు ఎలాంటి వస్తువులు ఉండరాదని జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. ఏవైనా అసాంఘిక సంఘటనలు జరిగే పరిస్థితి ఉంటే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు మొత్తం 11 పోలింగ్ కేంద్రాల వద్ద సుమారు వంద మంది పోలీసు, అధికారులును బందోబస్తుకు నియమించడం జరిగిందన్నారు.


పోలీసు అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న డీఎస్పీ యశ్వంత్

పాస్టర్లపై దాడులను అరికట్టాలి

హిందూపురం టౌన్: దేశంలో క్రైస్తవ మిషనరీ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని, ప్రభుత్వాలు, సంబంధిత శాఖల అధికారులు వాటిని పరిరక్షించాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రదర్ గద్దపాటి విజయరాజు అన్నారు. శనివారం స్థానిక సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో క్రైస్తవ నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మత ఛాందసవాదులు పేట్రేగిపోతున్నారని, క్రైస్తవంపై, చర్చిలపై, పాస్టర్లపై, దాడులు చేస్తున్నారన్నారు. దోషులను శిక్షించాలన్నారు. భారత రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన మత స్వేచ్ఛను కాపాడాలన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలన్నారు. పట్టణంలోని సీఅండ్‌ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చి మిషనరీ ఆస్తులు అన్యాక్రాంతం అయ్యాయని, ప్రభుత్వం కల్పించుకుని న్యాయం చేయాలని కోరారు. క్రైస్తవ శ్మశాన వాటికలకు స్థలాలు, కమ్యూనిటీ హాల్‌కు నిధులు విడుదల చేయాలన్నారు. అనంతరం శ్రీసత్యసాయి జిల్లా యూత్ కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏఐసీఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ బిషప్ జాకబ్ శామ్యూల్, చర్చ్ సెక్రటరీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, పాస్టర్ ఫెలోషిప్స్ అధ్యక్షుడు డేవిడ్ సూర్య ప్రకాష్, పాస్టర్ స్టీఫన్ రాజ్, కోశాధికారి ఆదర్శ్ కుమార్, సంఘ డీకెన్లు ఆనంద్ రాజ్, క్రిస్టఫర్, జాన్సన్, జార్జ్ బాబు, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, అంజనేయులు, పాస్టర్ జయరాజ్, మింటూ మనోజ్, డ్యాని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఐసీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయరాజు

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

గుడిబండ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆర్డీటీ సీడీసీ మెంబర్ కవిత సూచించారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఆర్డీటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పుర వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు, రోజుకూ మహళల భాగస్వామ్యం అన్ని రంగాల్లో పెరుగుతుందన్నారు. మహిళలు చదువుతో పాటు, రాజకీయంగా, ఇర్థాకంగా కూడా రాణించాలన్నారు. ప్రభుత్వం కూడా మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రయంలో మహిళా సంఘం సభ్యులు, యానిమేటరు, ఆశావర్కర్లు, ఆర్డీటీ సిబ్బంది హనుమంతరాయన్న, హమక్క, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

పావగడ: మహిళలు పురుషులతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని డాక్టర్ జయంతి తెలిపారు. స్థానిక ఆంజనేయ శెట్టి కల్యాణ మండపంలో వాసవీ వనిత మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వైద్యురాలు, న్యాయవాది, రాజకీయ నాయకురాలు తదితర వేషధారణలతో అలరించారు. వివిధ రంగాలలో రాణించిన మహిళలకు మొక్కలను అందించి సన్మానించారు. కార్యక్రమంలో ఉమా శ్రీనాథ్, లక్ష్మి శ్రీనాథ్, శాంత ప్రకాశ్, వాణి అశ్వథ్ నారాయణ తదితర వాసవి మహిళా మండలి,వనితా మహిళా మండలి పదాధికారులు పాల్గొన్నారు.


వివిధ వేషధారణల్లో ఉన్న మహిళలు

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

హిందూపురం టౌన్: నులి పురుగుల నివారణతో చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు అన్నారు. శనివారం స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఆశాకార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారుల్లో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి వారి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఈనెల 14న 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు పిల్లలకు 'ఆల్బెండజోల్' మాత్రలను అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. నులి పురుగుల వల్ల రక్తహీనత, ఆకలి మందగించడం, కడుపునొప్పి, వికారం బలహీనత, మలంలో రక్తం, వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడం తదితర లక్షణాలుంటాయన్నారు. ఆరు బయట మలవిసర్జన చేయకుండా, గోళ్లు పెరగకుండా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మలవిసర్జన తర్వాత భోజనానికి ముందు, తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు ఆయిషా తస్నీం, డీపీఎంఓ వెంకటరమణ, శివన్న, సరస్వతి, ముస్తఫా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దేవత సంకీర్తనలు

రొళ్ల: లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి ఆలయ ఆవరణలో దేవత సంకీర్తనల కార్యక్రమాన్ని నిర్వహించారు. వేకువజామున లక్ష్మీదేవి సమేత నరసింహస్వామి మూల విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం వెండి కవచాలు, బంగారు ఆభరణాలు, భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టువస్త్రాలు, వడి బియ్యం, పూలతో స్వామిని అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

నేడు భూతప్పల ఉత్సవం

రొళ్ల లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ భూతప్ప స్వామి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భూతప్ప ఉత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో భక్తులు శనివారం సాయంత్రమే ఆలయం వద్దకు చేరుకున్నారు. భక్తులు ఇబ్బందులు పడకుండా కమిటీ ఏర్పాట్లు చేశారు.

ఘనంగా నరసింహస్వామి పున్నమి ఉత్సవం

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లి గ్రామంలో శనివారం దళితుల ఆరాధ్య దేవుడు లక్ష్మీ నరసింహస్వామి కదిరి పున్నమి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి అర్చకులు ఉదయం వివిధ రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా నల్ల కంబడి పరచి అందులో బొరుగులు, బెల్లం, అరటి పండ్లు నైవేద్యంగా ఉంచారు. అనంతరం కంబడి చుట్టూ తిరుగుతూ నృత్యం చేస్తూ భూతప్పలు ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే సాయంత్రం ఆలయంలో 101 దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు ప్రసాదం అందజేశారు.


దీపాలను వెలిగించడానికి వెళుతున్న భక్తులు

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తికి గాయాలు

చిలమత్తూరు: మండల పరిధిలోని దేమకేతేపల్లి పంచాయతీ గాద్రాలపల్లి వద్ద శనివారం రాత్రి 10:30 గంటల సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న బ్రహ్మేశ్వరంపల్లికి చెందిన రవీంద్రారెడ్డిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. క్షతగాత్రుడిని హుటాహుటిన 108లో హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఈ సంఘటనపై ఆరా తీశారు. అయితే రవీంద్రారెడ్డి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. బస్సు ఢీకొందని స్థానికులు చెబుతున్నారు. మరికొందరు మాత్రం అతనే బస్సు కింద పడినట్లు తెలిపారు. పోలీసులు దర్యాప్తులో వాస్తవాలు తెలియాల్సి ఉంది.


గాయపడిన రవీంద్రారెడ్డి

ఘనంగా గురుకుల పాఠశాల వార్షికోత్సవం

లేపాక్షి: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల, కళాశాలల 37వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ ప్రసాద్ అధ్యక్షతన శనివారం సాయంత్రం ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హిందూపురం మున్సిపల్ కమిషనర్ కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే ఉపాధ్యాయులు, పాఠశాల, మీ తల్లిదండ్రులకు మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. విశ్రాంత ఏబీసీడబ్ల్యూఓ రామప్ప విద్యార్థులకు 112 రైటింగ్ ప్యాడ్స్, పెన్నులు, పెన్సిళ్లు, స్కేల్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గురుకుల పాఠశాలల ప్రధానచార్యులు గోపాల్, మురళీధర్‌రావు, సాగర్, రామాంజినేయరెడ్డి, వివేకానంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సల్మాన్ రాజ్, పాఠశాల కమిటి చైర్మన్ రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు

172 మందికి కంటి పరీక్షలు

అమరాపురం: స్థానిక ప్రాథమిక పాఠశాల మెయిన్‌లో శనివారం జ్ఞాన వృక్ష చారిటబల్ కంటి వైద్య బృందం, డాక్టర్ విద్య, క్యాంపు మేనేజర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో 172 మందికి కంటి పరీక్షలు చేశారు. 101 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. బెంగళూరు నగరంలోని శంకర్ కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేయించి, ఉచితంగా కంటి అద్దాలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

హిందూపురం: స్థానిక ఆల్‌హిలాల్ పాఠశాలలో ట్రినిటీ సర్వీసెస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డాక్టర్‌కుమార్ రాజా, కార్యదర్శి ఉషారాణి, బెంగళూరు కంటి ఆసుపత్రి బృందం సంయుక్తంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 375 మందికి కంటి పరీక్షలు చేసి, 110 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు బెంగళూరు శంకర కంటి ఆసుపత్రి డాక్టర్ ప్రియ తెలిపారు. అలాగే గత నెలలో ఆపరేషన్ చేయించుకున్న వారికి ఉచితంగా కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. క్యాంప్ ఇన్‌చార్జ్ శివప్రకాష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం షాపుల బంద్

పెనుకొండ: పట్టణంలో శనివారం ఎక్సైజ్ అధికారులు మద్యం షాపులను బంద్ చేశారు. ఈనెల 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా మధ్యాహ్నం నాలుగు గంటలకే షాపులను మూసేశారు. సోమవారం వరకూ షాపులను తెరవబోమని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఐచర్

సోమందేపల్లి: మండల కేంద్రంలోని మణికంఠ కాలనీ సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఐచర్ ఢీకొన్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. వినాయక నగర్‌కు చెందిన రాజు, గంగమ్మ ద్విచక్ర వాహనంలో వెంకటాపురం తండా వద్ద ఉన్న వ్యవసాయ పొలం వద్దకు బయలుదేరారు. బెంగళూరు వైపు నుంచి వస్తున్న ఐచర్ వాహనం వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో గంగమ్మకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం బెంగళూరు ఆసుపత్రికి తరలించారు. రాజుకు స్వల్ప గాయాలు కాగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్ కుమార్ తెలిపారు.

మానసిక వికలాంగుడికి సపర్యలు


మానసిక వికలాంగుడికి స్నానం చేయిస్తున్న సత్యసాయి సేవాసమితి భక్తులు

పెనుకొండ: పట్టణంలో మానసిక స్థితి సరిగా లేని వికలాంగుడికి సత్యసాయి సేవా సమితి సభ్యులు శనివారం సపర్యలు చేసి, మానవత్వం చాటుకున్నారు. వికలాంగుడు వాడి పారవేసిన ప్లాస్టిక్ కవర్లు ధరిస్తున్నాడు. అతడికి తిండి ఇచ్చేందుకు స్థానికులు భయపడుతున్న తరుణంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు, ఆధ్యాత్మిక కోఆర్డినేటర్ కృష్ణ చేరదీశారు. వ్యక్తి ధరించిన ప్లాస్టిక్ కవర్లు తొలగించారు. స్నానం చేయించి, దుస్తులు అందించారు. అనంతరం భోజనం పెట్టారు.

ఇంటింటా ఫీవర్ సర్వే

మడకశిరరూరల్: మండలంలోని పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వేను మరింత వేగవతం చేయాలని డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం కల్లుమర్రి, గుండుమల, నీలకంఠాపురం, కదిరేపల్లి పీహెచ్‌సీల వైద్య సిబ్బందితో ఫీవర్ సర్వేపై సమీక్షించారు. గ్రామాల్లో పర్యటించి దగ్గు, జ్వరం తదితర వాటితో పాటు సీజనల్ వ్యాధులపై సర్వే నిర్వహించాలన్నారు. ప్రజలు సంపూర్ణ ఆరోగ్యం కోసం ఈ ఫీవర్ సర్వే చేపట్టామన్నారు. మాస్క్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కదిరేపల్లి గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహిస్తూ ఆరోగ్య సూత్రాలు పాటించే విధంగా ప్రజలు అవగాహన కల్పించాలన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన


మహిళలకు గ్యారంటీ కార్డులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పావగడ: రాష్ట్రంలో సుస్థిర పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్థానిక విధాన సభ క్షేత్రం కాంగ్రెస్ అభ్యర్థి హెచ్.వి వెంకటేశ్ అన్నారు. శనివారం తాలూకాలోని రంగసముద్రం గ్రామ పంచాయతీలోని ఓబుళాపురం, బెళ్ళిబట్లు, దొడ్డేనహళ్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఒక వ్యక్తికి 10 కేజీల బియ్యం, మహిళలకు నెలకు రూ.2 వేల ఆర్థిక సాయం, 200 యూనిట్ల వరకూ విద్యుత్ ఉచితంగా అందిస్తామన్నారు. అనంతరం గృహలక్ష్మి, గృహజ్యోతి, అన్నభాగ్య పథకాల గ్యారంటీ కార్డులను మహిళలకు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. చంద్రశేఖరరెడ్డి, మారణ్ణ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఏదైనా సాధ్యమే

హిందూపురం టౌన్: శ్రద్ధగా చదివితే పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తారని ఎంఈఓ గంగప్ప అన్నారు. శనివారం స్థానిక ఎంజీఎం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులకు ఎస్ఎస్‌సీ పరీక్షలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఇష్టపడి చదివితే కష్టమైనది కూడా సులభంగా మారుతుందన్నారు. 10వ తరగతి విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించి హిందూపురాన్ని జిల్లా స్థాయిలో మంచి స్థానంలో నిలబెట్టాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు: మండలంలోని మరవకొత్తపల్లి వద్ద అక్రమంగా రవాణా చేస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శనివారం సాధారణ తనిఖీల్లో మండలంలోని శెట్టిపల్లి గ్రామానికి చెందిన కిష్టప్పను అదుపులోకి తీసుకుని 144 టెట్రా ప్యాకెట్లు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

లేపాక్షి: మండల కేంద్రంలోని బస్టాండు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద ఆదివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ నారాయణస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ శాఖల నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని పేర్కొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఉదయం 10 గంటలకు వైఎస్సీర్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడే బోయ నరసింహ, మండల కన్వీనర్ నాగలూరు బాబు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్లు అందించడం జరుగుతుందన్నారు.

వ్యక్తికి గాయాలు

రొళ్ల: మండల పరిధిలోని గుడ్డగుర్కి గ్రామంలో శనివారం సాయంత్రం గంగాధర్ అనే వ్యక్తి కొబ్బరి చెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. వివరాలు.. గంగాధర్ తన ఇంటి ఆవరణలో కొబ్బరి కాయలు కోసేందుకు చెట్టు ఎక్కాడు. అయితే ప్రమాదవశాత్తూ జారి కింద పడంతో కాలు, ముఖానికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే 108లో రొళ్ల సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. ప్రస్తుతం గంగాధర్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం.

చదువుపై దృష్టి పెట్టేలా చూడాలి

అమరాపురం: పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్న దృష్ట్యా విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలని ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర కుమార్ సూచించారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠ్యాంశాలను రివిజన్ చేయించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి పనులు పెట్టకుండా కేవలం చదువుపై దృష్టి పెట్టేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, నరసింహమూర్తి, లింగన్న, భీమేష్, యంజేరప్ప పాల్గొన్నారు.

జామియా మసీదు నూతన కమిటీ ఎన్నిక

పావగడ: స్థానిక జామియా మసీదు నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా లతీఫ్, ఉపాధ్యక్షుడిగా గౌస్ మహదీన్ సాబ్, కార్యదర్శిగా మహ్మద్ జావీద్, ట్రెజరర్‌గా ఎండీ షమీవుల్లా ఎంపికయ్యారు. వీరితో పాటు సభ్యులుగా మహ్మద్ రఫీక్, మహ్మద్ అల్తాఫ్ సాబ్, మహ్మద్ అలీముల్లా, రహ్మతుల్లా తరల్లె ఖాన్, ఖలీముల్లా, బీఎం షఫీ, ఎంఎఫ్ షరీఫ్, రిజ్వానుల్లా, నిజామలి, సమీఉల్లా షరీఫ్, సయ్యద్ సదీక్ వలి, పిజే సయ్యద్ నవాబ్, మహ్మద్ షఫీవుల్లా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు లతీఫ్ మాట్లాడుతూ.. కమిటీ పదాధికారులు, సభ్యుల సహకారంతో మసీదు అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

అగ్ని ప్రమాదంలో మేకల సజీవ దహనం


అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న గుడిసె

పావగడ: తాలూకాలోని బూదిబెట్ట గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె కాలిపోగా.. 15 మేకలు సజీవ దహనమయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన బంగారప్ప కొత్త ఇల్లు నిర్మిస్తున్నాడు. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న ఇంటి పక్కనే గుడిసె వేసుకున్నాడు. ఆకస్మికంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో గుడిసెలో మంటలు చెలరేగాయి. అంతలో మేలుకున్న బంగారప్ప గ్రామస్తుల సహకారంతో మంటలు ఆర్పేందుకు ప్రయత్నించాడు. అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయితే గుడిసెలో ఉన్న రూ.50 వేలు కాలిపోయాయి. అలాగే కొట్టంలో కట్టేసిన 15 మేకలు మృతి చెందాయి. బాధితుడు బంగారప్ప భార్య రోధించిన తీరు అందర్నీ కంటతడి పెట్టించింది.